
# జిల్లా ఓటర్లు

## 15,54,712

- ముసాయిదా జాబితా తర్వాత పెరిగింది 9,046
- ఐదేళ్లలో 1,11,670 ఓట్ల పెరుగుదల
- 3379 సర్వీసు.. 166 ఎన్ఆర్ఐ ఓట్లు
- తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల అధికారి





**జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 15,54,712 మంది ఓటర్లున్నట్లు తేలింది. వీరిలో 7,65,903 మంది పురుషులు, 7,88,725 మంది మహిళలు, 84 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అలాగే 3379 సర్వీసు ఓట్లు, 166 ఎన్ఆర్ఐ ఓట్లు కూడా ఉన్నాయి. అత్యధికంగా పలమనేరు నియోజకవర్గంలో 2,66,935 ఓట్లు ఉండగా, అత్యల్పంగా చిత్తూరులో 2,00,822 ఓట్లు ఉన్నాయి. జిల్లాలో మహిళా ఓటర్లే అధికం. కాగా, ముసాయిదా జాబితాతో పోల్చుకుంటే తుది జాబితాలో 9046 ఓట్లు పెరిగాయి. 2019 జనవరిలో విడుదల చేసిన తుది జాబితాతో పోల్చుకుంటే 1,11,670 ఓట్లు పెరిగాయి. ఈ మేరకు సోమవారం డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ జిల్లా తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. గతేడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే.**




- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ చిత్తూరు కలెక్టరేట్

**జిల్లా తుది ఓటర్ల జాబితా**

| నియోజకవర్గం | 2024లో పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు | 2019లో మొత్తం ఓటర్లు | తేడా |
|---|---|---|---|---|---|---|
| పుంగనూరు | 116623 | 121172 | 8 | 237803 | 218268 | 19535 |
| నగరి | 98081 | 103358 | 8 | 201447 | 186227 | 15220 |
| జీడీనెల్లూరు | 101710 | 102918 | 7 | 204635 | 193588 | 11047 |
| చిత్తూరు | 97765 | 103023 | 34 | 200822 | 179996 | 20826 |
| పూతలపట్టు | 108381 | 111577 | 8 | 219966 | 208203 | 11763 |
| పలమనేరు | 132112 | 134822 | 1 | 266935 | 247613 | 19322 |
| కుప్పం | 111231 | 111855 | 18 | 223104 | 209147 | 13957 |
| మొత్తం | 765903 | 788725 | 84 | 15,54,712 | 14,43,042 | 1,11,670 |



ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్

| వయసు | ఓటర్లు |
|---|---|
| 18-19 | 33495 |
| 20-29 | 275446 |
| 30-39 | 406176 |
| 40-49 | 371653 |
| 50-59 | 236762 |
| 60-69 | 144152 |
| 70-79 | 67831 |
| 80-89 | 17268 |
| 90-99 | 1881 |
| 100పైబడి | 48 |

### ● 30-39 ఏళ్ల వయసువారే ఎక్కువ

తుది ఓటర్ల జాబితాలో 30-39 ఏళ్ల మధ్య వయసున్నవారే అత్యధికంగా ఉన్నారు. 33495 మంది 18-19 వయసువారు కొత్తగా ఓటు హక్కును పొందారు. వచ్చే ఎన్నికల్లో వీరంతా తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 20-29 వయసువారు రెండో సారి ఓటు వేయనున్నారు.

● అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదా జాబితాతో తుది జాబితాను పోల్చితే.. నగరి, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయి. పుంగనూరు, జీడీనెల్లూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఓట్లు పెరిగాయి.

● ప్రతి సాధారణ ఎన్నికలకు రెండు నెలల ముందు తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. 2019 ఎన్నికల సమయంలో జనవరి 11న విడుదల చేసిన తుది జాబితాతో సోమవారం నాటి జాబితాను పోల్చితే, 1,11,670 ఓట్లు పెరిగాయి. చిత్తూరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో అత్యధికంగా ఓట్లు పెరిగాయి. జీడీనెల్లూరులో తక్కువగా పెరిగాయి.

**గతేడాది అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదా జాబితాతో పోల్చుకుంటే..**

| నియోజకవర్గం | ముసాయిదా జాబితా ఓట్లు | తుది జాబితా ఓట్లు | పెరుగుదల |
|---|---|---|---|
| పుంగనూరు | 235220 | 237803 | 2583 |
| నగరి | 202437 | 201447 | -990 |
| జీడీనెల్లూరు | 202850 | 204635 | 1785 |
| చిత్తూరు | 201609 | 200822 | -787 |
| పూతలపట్టు | 223326 | 219966 | -3360 |
| పలమనేరు | 262453 | 266935 | 4482 |
| కుప్పం | 217771 | 223104 | 5333 |
| మొత్తం | 15,45,666 | 1554712 | 9,046 |

● గతేడాది అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా కంటే సోమవారం నాడు విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 9046 మంది ఓటర్లు పెరిగారు. కానీ, నియోజకవర్గాల వారీగా చూసుకుంటే పుంగనూరు, పలమనేరు, కుప్పంలో ఎక్కువగా కొత్త ఓట్లు చేరాయి. పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరులో ఎక్కువగా ఓట్లను తొలగించారు. మొత్తంగా ఏడు నియోజకవర్గాల్లో 76,466 ఓట్లను తొలగించగా, 85,512 ఓట్లను చేర్చారు.

### ● తగ్గిన 'ఒకే ఇంట్లో పదికి మించిన ఓట్లు'

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని 842 ఇళ్లల్లో 10607 ఓట్లు (ఒకే ఇంట్లో పదికి మించి) ఉండగా.. తుది జాబితాలో ఈ సంఖ్యను అధికారులు తగ్గించారు. ఇప్పుడు 38 ఇళ్లల్లో 443 ఓట్లున్నట్లు, అవి కూడా పక్కా ఓట్లు కావడంతోనే ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే ముసాయిదా జాబితాలో 855 ఓట్లలో పేర్లు జీరోలు, సింబల్స్‌తో ఉండగా, ఇప్పటి జాబితాలో 220 కార్డులు ఉన్నాయి.

**ముసాయిదా జాబితా తర్వాత జతచేసిన, తొలగించిన ఓట్లు**

| నియోజకవర్గం | జత చేసిన ఓట్లు | తొలగించినవి |
|---|---|---|
| పుంగనూరు | 16509 | 13926 |
| నగరి | 9064 | 10054 |
| జీడీనెల్లూరు | 9595 | 7810 |
| చిత్తూరు | 12260 | 13047 |
| పూతలపట్టు | 9900 | 13260 |
| పలమనేరు | 14073 | 9591 |
| కుప్పం | 14111 | 8778 |
| మొత్తం | 85,512 | 76,466 |

### ● ఇంటింటి సర్వే కంటే నేరుగా 20శాతం ఎక్కువగా దరఖాస్తులు

గతేడాది ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం జరిగింది. ఇందులో 17,886 దరఖాస్తులు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు వచ్చాయి. డూప్లికేట్ ఓట్లకు 3345, మరణించినవారివి 35743, శాశ్వతంగా షిఫ్ట్ అయినందుకు 7561 దరఖాస్తులు ఫాం7 కింద అందాయి. కార్డుల్లో చిన్నపాటి కరెక్షన్స్ కోసం 13647, అడ్రస్ మార్పుల కోసం 16235 దరఖాస్తులు ఫాం8 కింద అందాయి. వీటన్నింటిని అధికారులు పరిష్కరించారు. ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తుల కంటే సాధారణంగా అందిన దరఖాస్తుల సంఖ్య 20 శాతం అధికంగా ఉంది. ఈసారి రాజకీయ పార్టీలు కల్పించుకుని దరఖాస్తులు చేయడంతో ఇంటింటి సర్వే కంటే అధికంగా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఏడాదికి సగటున 15 వేల మంది ఓటర్లు మరణిస్తుండగా, గత జాబితా తర్వాత 35,743 వేల మంది మరణించినట్లు తాజా జాబితాలో ఓట్లను తొలగించారు.

### ● 22,862 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు

జిల్లాలో 22862 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పోలింగ్ నాడు వారంతా కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా ఆయా పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు, బీఎల్వోలు బాధ్యత తీసుకునేలా చర్యలు తీసుకుంటామని, వారికి అవసరమైన ఏర్పాట్లను చేస్తామని అధికారులు అంటున్నారు. పుంగనూరులో 3259, నగరిలో 3254, జీడీనెల్లూరులో 3482, చిత్తూరులో 2498, పూతలపట్టులో 3707, పలమనేరులో 3749, కుప్పంలో 2913 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు.

## మండలాలకు ఓటరు జాబితాలు



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: కలెక్టరేట్ నుంచి తుది ఓటర్ల జాబితాలను ఆది, సోమవారాల్లో మండల, నియోజకవర్గ కేంద్రాలకు ఎన్నికల విభాగం తరలించింది. ప్రతి పోలింగ్ కేంద్రానికి 12 సెట్ల జాబితాలు వెళ్లాయి. దీంతోపాటు ప్రతి మండల, నియోజకవర్గ కేంద్రాలతో పాటు బీఎల్వో కార్యాలయాలకు, ఎన్నికల అధికారులకు ఒక్కో సెట్ జాబితాను అందించారు. ఇంకా గుర్తింపు పొందిన ఏడు రాజకీయ పార్టీలకు జాబితాలు అందించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి తన పరిధిలోని రాజకీయ పార్టీల నేతలకు జాబితాలు అందించారు. పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్వోల వద్ద జాబితాలు అందుబాటులో ఉంచారు. ఓటర్లు తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారిని సంప్రదించి ఓటు వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా, లేదా ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా గుర్తించవచ్చు. ఒకవేళ ఎవరి ఓటైనా గల్లంతై ఉంటే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

ఓటర్ల నమోదు, మార్పు చేర్పులు

## నిరంతర ప్రక్రియ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: ఓటర్ల నమోదు, మార్పులు- చేర్పుల ప్రక్రియ నామినేషన్ల స్వీకరణ చివరిరోజు వరకు నిరంతరంగా కొనసాగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో సోమవారం ఆయన రాజకీయ పార్టీలప్రతినిధులతో సమావేశమయ్యారు. తుదిజాబితాలో ఓటు లేదని ఓటర్లు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇప్పుడు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జనాభా ప్రాతిపదికన పరిశీలిస్తే మరో ఏడువేల మంది యువతీయువకులు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చిన సమస్యలను లిఖితపూర్వకంగా అందిస్తే పరిశీలిస్తామన్నారు. ఐదు కన్నా ఎక్కువ అభ్యంతరాలు వచ్చిన వాటిని ప్రత్యేక కమిటీల ద్వారా పరిశీలన చేయించామన్నారు. మృతిచెందిన ఓటర్లకు సంబంధించి ఆధారాల అనుగుణంగా తొలగించామన్నారు. 20 ఏళ్లలోపు యువత ఓటు నమోదు చేసుకునేందుకోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేత వి.సురేంద్రకుమార్ కోరారు. తుది ఓటరు జాబితాలను గ్రామ సచివాలయాల్లో కూడా ఏర్పాటు చేస్తే ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికలు జరిగేంతవరకు రాజకీయ పార్టీలతో తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, వివిధ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ), భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), లోకేష్ (ఆమ్‌ఆద్మీపార్టీ), ఇతర అధికారులు పాల్గొన్నారు.





రామకుప్పంలో పంచాశ్వరథంలో ఊరేగుతున్న సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి

## అంతటా శ్రీరామ నామస్మరణే

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం జిల్లాలో ఎటు చూసినా శ్రీరామ నామమే వినిపించింది. పట్టణం.. పల్లెలనే తేడా లేకుండా పలు ప్రాంతాల్లో శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడి ఉత్సవమూర్తులతో శోభాయాత్రలు నిర్వహించారు. భజనలు చేశారు. అన్నదానాలు చేశారు. పలుచోట్ల వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

- చిత్తూరు



పుంగనూరులో శోభాయాత్ర

## సమ్మె విరమించి.. నేటి నుంచి విధుల్లోకి!



ఛలో విజయవాడను అడ్డుకున్నందుకు నిరసనగా కార్వేటినగరంలో ఆందోళన

చిత్తూరు, జనవరి 22: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఆరు వారాలుగా అంగన్వాడీలు చేపట్టిన సమ్మెను సోమవారం రాత్రి విరమించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సానుకూలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం నుంచి విధులకు హాజరుకానున్నారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్లారు. ప్రభుత్వంతో పలుమార్లు జరిపిన చర్చలు విఫలం కావడంతో అంగన్వాడీలు కూడా వెనక్కి తగ్గలేదు. చివరగా ప్రభుత్వం ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించి, విధుల్లో చేరనివారికి షోకాజ్ నోటీసులు అందించారు. ఈ నెల 9వ తేదీన సుమారు 1800 మందికి నోటీసులు అందించి పది రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. 19వ తేదీలోగా అందరూ వివరణ ఇవ్వగా కొందరే విధుల్లో చేరారు. మరికొందరు డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు చేరేది లేదని భీష్మించుకున్నారు. దీంతో సోమవారం వరకు విధుల్లో చేరని 836 మంది అంగన్వాడీలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 2380 మంది టీచర్లు, 1795 మంది ఆయాలు పనిచేస్తున్నారు. సోమవారం వరకు ప్రభుత్వ బెదిరింపులకు, నోటీసులకు తలొగ్గి 836 మంది మినహా మిగిలినవారంతా విడతల వారీగా విధుల్లో చేరారు. పుంగనూరు, జీడీనెల్లూరు, కుప్పం నియోజకవర్గాల్లో వైసీపీ నాయకుల బెదిరింపులతో ప్రారంభంలోనే విధుల్లో చేరిపోయారు. ఇంకా విధుల్లో చేరని బైరెడ్డిపల్లె ప్రాజెక్టులో 59 మంది టీచర్లు, 46 మంది ఆయాలు.. కార్వేటినగరంలో 70 మంది టీచర్లు, 57 మంది మంది ఆయాలు.. కుప్పంలో 157 మంది టీచర్లు, 108 మంది ఆయాలు.. పలమనేరులో 67 మంది టీచర్లు, 58 మంది ఆయాలు, శాంతిపురంలో 140 మంది టీచర్లు, 74 మంది ఆయాలను తొలగిస్తూ ఐసీడీఎస్ పీడీ నాగశైలజ ఉత్తర్వులు జారీ చేశారు. సమ్మె విరమణ నేపథ్యంలో ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోనున్నారు.

### ఛలో విజయవాడను అడ్డుకుని..

కాగా, తమ పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీరుకు నిరసనగా అంగన్వాడీలు మంగళవారం ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా నుంచి ఎవరూ విజయవాడకు వెళ్లకుండా పోలీసులు ఆది, సోమవారాల్లో అంగన్వాడీ నేతలను గృహ నిర్బంధం చేశారు. కుప్పం, పలమనేరు, చిత్తూరు, కార్వేటినగరం ప్రాంతాల్లోని నేతల్ని ఇళ్లకే పరిమితం చేశారు. కళ్లుగప్పి బయల్దేరిన వారిని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అడ్డుకున్నారు. పోలీసుల తీరుకు నిరసనగా కార్వేటినగరంలో సోమవారం అంగన్వాడీలు ఆందోళన చేశారు.





## 29న షర్మిల జిల్లా పర్యటన



వెదురుకుప్పం, జనవరి 22: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు (పీసీసీ) వైఎస్ షర్మిల జిల్లా పర్యటన ఖరారైందని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. వెదురుకుప్పంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆమె సమావేశమవుతారని చెప్పారు. ఆమెతో పాటు సీడబ్ల్యూసీ, ఏఐసీసీ, ఏపీసీసీ ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పీసీసీ అధ్యక్షురాలిగా ప్రమాణస్వీకారం చేశాక తొలిసారిగా ఆమె జిల్లాకు వస్తున్నారన్నారు.

# న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

● కలెక్టరేట్ వద్ద పురుగుల మందు డబ్బాతో ఓ దళిత కుటుంబం నిరసన



బిడ్డలతో కలసి పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్ వద్ద కూర్చున్న సుబ్రహ్మణ్యం

చిత్తూరు, జనవవరి 22: ఈ ఫొటోలో దీనంగా కూర్చున్నది ఓ దళిత కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. వంశపారపర్యంగా వచ్చిన భూమికి పట్టాలివ్వాలని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దాంతో అనుభవంలో ఉన్న భూమికి పట్టాదార్ పాసుపుస్తకాన్ని ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ సోమవారం 'స్పందన' నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద పురుగుల మందు డబ్బాతో ఈ కుటుంబం ఆందోళనకు దిగింది. అధికారుల హామీతో వెనుతిరిగారు. వివరాలిలా ఉన్నాయి. వి.కోట మండలం సుద్దులగుంట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంకు 74 ముదరందొడ్డి గ్రామ లెక్కదాఖలాలో సర్వే నెంబరు 788-1లో 3.30 ఎకరాలు, 789-2లో 1.30 ఎకరాల భూమితో కలిపి మొత్తం 4.60 ఎకరాలు ఉన్నాయి. వీటిలో కొంత బండ, పెద్ద పెద్ద రాళ్లు ఉన్నాయి. రాళ్లుపోనూ 3.30 ఎకరాల సేద్యపు భూమి ఉంది. ఈ భూమిని సర్వే చేసి పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలని నాలుగేళ్లుగా తహసీల్దారును కోరుతున్నారు. కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేసి 1.30 ఎకరాలు మాత్రమే అని చెప్పి స్కెచ్‌వేసి ఇచ్చారు. వంశపారంపర్యంగా వచ్చిన భూమిలో చింత చెట్లు, మామిడి చెట్లు, తైలం చెట్లు ఉండే ఆధారాలను కూడా రెవెన్యూ అధికారులకు సుబ్రహ్మణ్యం చూపారు. గ్రామంలో కొంత మంది రాజకీయ నాయకుల మాటలు విని తన భూమిని తక్కువ చేసి చూపిస్తున్నారని ఆయన ఆరోపించారు. మండల స్థాయిలో తనకు న్యాయం జరగదని భావించి.. కుటుంబంతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చారు. ఇతడి భార్య భూలక్ష్మి అర్జీ ఇవ్వడానికి క్యూలో నిల్చోగా.. ఇతడు బిడ్డలతో కలిసి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా బయటకు తీసి కలెక్టరేట్ వద్ద నిరసనగా కూర్చున్నారు. గుర్తించిన అధికారులు, పోలీసులు వెంటనే పురుగుల మందును తీసుకుని బాధితుడ్ని జేసీ వద్దకు తీసుకెళ్లారు. తనకు జరిగిన అన్యాయాన్ని భార్యతో కలిసి వివరించారు. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఈ భూమి తప్ప ఇతర ఆదాయమేమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రంగా సర్వే చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

## కలెక్టరేట్ స్పందనకు 277 అర్జీలు

జిల్లా నలుమూలల నుంచి 277 మంది కలెక్టరేట్‌కు వచ్చి స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేశారు. వీరి నుంచి జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. రెవెన్యూశాఖకు 206, డీఆర్‌డీఎకు 17, జిల్లా రిజిస్ట్రారుకు 3, నేషనల్ హైవేకు 2తో పాటు ఇతర శాఖలకు 49 చొప్పున అర్జీలు అందాయి.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

## పోలీసు స్పందనకు 15 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 15 మంది బాధితులు వినతిపత్రాలను అందించారు. బాధితుల నుంచి ఎస్పీ రిషాంత్‌రెడ్డి వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో భూ తగాదాల కింద 9, ఆస్తి తగాదాలు 3, కుటుంబ తగాదాలు 2, వేధింపుల కింద 1 వంతున ఉన్నాయి. ఈ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విధుల నిర్వహణపై మరింత అవగాహన పెంచుకోవాలని నోడల్ అధికారులకు కలెక్టర్ షన్మోహన్ సూచించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్ యాక్టివిటీస్, ఈవీఎం మేనేజ్‌మెంట్, ఎంసీసీ, ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్ పోస్టల్ బ్యాలెట్, ఎంసీఎంసీ తదితర విభాగాలకు సంబంధించిన అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

**నేడు మాక్ పోల్ :** అన్ని పాఠశాలల్లో మంగళవారం విధిగా మాక్‌పోల్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. మాక్‌పోల్ నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో ఓటు హక్కు వినియోగించుకునే అంశంపై అవగాహన కలుగుతుందన్నారు. 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. కళాశాలలు, వసతిగృహాలు, స్వయంసహాయక సంఘాల మహిళలకు రంగోళి, విద్యార్థులకు వ్యాస, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

## మారథాన్‌లో ఎస్ఐ ప్రతిభ



మారథాన్‌లో పాల్గొన్న ఎస్ఐ రామకృష్ణ

చిత్తూరు, జనవరి 22: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఎస్ఐగా పనిచేస్తున్న వి.రామకృష్ణ మారథాన్ పరుగుపందెంలో విశేష ప్రతిభ కనబరిచారు. ముంబైలో జరిగిన టాటా ముంబై మారథాన్ పోటీలలో 42.2 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటల 31 నిమిషాల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించారు. గతేడాది ఇదే పోటీలో ఆయన 4గంటల 19 నిమిషాల్లో పూర్తి చేయగా, ఈ ఏడాది 48 నిమిషాల సమయాన్ని తగ్గించి తన రికార్డును తానే బ్రేక్ చేశారు. ఆయన్ను ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు అభినందించారు. రాబోయే యూఎస్ఏ బోస్టర్ మారథాన్ పోటీల్లో పాల్గొని రికార్డు సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## రూ.93.64 కోట్ల జడ్పీ మిగులు బడ్జెట్ ఆమోదం

● స్థాయిసంఘ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: రానున్న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.93.64 కోట్ల జిల్లా పరిషత్ మిగులు బడ్జెట్‌ను 1-7 స్థాయి సంఘం ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ తీర్మానించింది. సోమవారం జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన 1, 7 స్థాయి సంఘ సమావేశం ఆయన చాంబర్‌లో జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాబడి పద్దులో రూ.4133.08 కోట్లు, అంచనా వ్యయపద్దులో రూ.4039.44 కోట్లుగా, మిగులు పద్దులో రూ.93.64 కోట్లతో జడ్పీ బడ్జెట్‌లో రూపొందించారు. ఈ అంచనా బడ్జెట్‌ను మంగళవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెడతారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఓటర్ల సౌలభ్యం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులకు జడ్పీ చైర్మన్ సూచించారు. ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతరంగా సర్వీసు రోడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. కుప్పం, పలమనేరు, వి.కోటల్లో జడ్పీ అతిథిగృహాలను పునర్నిర్మించాల్సి ఉందన్నారు. బోయకొండ మల్లయ్యకొండ, దుర్గంకొండ తదితర ప్రాంతాల్లో నిర్మాణాలకు అంచనాలు సిద్ధంచేయాలని సూచించారు. బడ్జెట్ అంచనాల గురించి సీఈవో ప్రభాకర్‌రెడ్డి క్లుప్తంగా వివరించారు. జడ్పీ వైస్‌చైర్మన్లు ధనుంజయ రెడ్డి, రమ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

చిత్తూరు, జనవరి 22: చిత్తూరులో సోమవారం బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. సాంబయ్యకండ్రిగకు చెందిన చంద్రశేఖర్(22) ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్‌చార్జి సీఐ ఉలసయ్య తెలిపారు.


## చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు : టీడీపీ



గడప గడపకు రా.. కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 22: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు వస్తుందని టీడీపీ నేతలు అన్నారు. చిత్తూరు నగరం దొడ్డిపల్లి, సాంబయ్యకండ్రిగలో సోమవారం టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రానికి టెక్నాలజీని తీసుకురావాలన్నా, నిరుద్యోగాన్ని అరికట్టడానికి ప్రసిద్ధి చెందిన కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. సీఎం జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం.. దాడులు చేయించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. నేతలు చంద్రప్రకాష్, సీఆర్ రాజన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, గురజాల జగన్‌మోహన్, డీకే బద్రినారాయణ, కోదండ యాదవ్, మోహన్‌రాజ్, యాదవ్, దుర్గాచౌదరి, రాజశేఖర్, శశికర్ బాబు, శ్రీనివాసులు, కిరణ్, హరి, తారాపతి, కన్నెప్ప, మునిరత్నం నాయుడు, గోపాలకృష్ణ, యుగంధర్, కాశి, జయశంకర్, జనసేన నేతలు దయారాం, ఆరణి కవిత, యశ్వంత్, ఏకే శరవణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## 132వ రోజుకు చేరిన డెయిరీ కార్మికుల దీక్ష



కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్న డెయిరీ కార్మికులు

చిత్తూరు (సెంట్రల్), సెంట్రల్ 22: పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష సోమవారానికి 132వ రోజుకు చేరింది. మూడు నెలలకు పైబడి కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమకు న్యాయం చేయాలని కార్మికులు రూబన్, కుమార్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, రవి, వెంకటాచలం తదితరులు విజ్ఞప్తి చేశారు.

## 'అంగన్వాడీల అక్రమ అరెస్టు తగదు'



అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాల నిరసన

చిత్తూరు రూరల్, జనవరి 22: విజయవాడలో దీక్షకు వెళ్తున్న అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడం తగదని సీపీఐ, సీపీఎం, కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. చిత్తూరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం వీరు నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించపోగా, ఎస్మా చట్టం ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను విజయవాడలో తెలిపేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. సీపీఐ నేత నాగరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో ప్రొటోకాల్ వివాదం

ఎమ్మెల్యే చంద్రబాబు పేరు లేకనే ప్రారంభోత్సవ శిలాఫలకం ● టీడీపీ నేతల అభ్యంతరం





గుడుపల్లె తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ వన్నెకుల క్షత్రియ నాయకులు - చంద్రబాబు పేరు లేకుండా సిద్ధం చేసిన శిలాఫలకం

కుప్పం, జనవరి 22: కుప్పంలో మరోసారి ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. గుడుపల్లె మండలం గుత్తార్లపల్లె సమీపంలో నిర్మించిన వన్నెకుల క్షత్రియ భవన ప్రారంభోత్సవ శిలాఫలకంలో స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబుతో పాటు, కుప్పం నియోజకవర్గం లోకల్ ప్రొటోకాల్ కలిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేరు లేవు. ఇది టీడీపీ వర్గాల ఆగ్రహానికి కారణమైంది. వివరాలిలా ఉన్నాయి. గుత్తార్లపల్లె సమీపంలో వన్నెకుల క్షత్రియకులస్థులకు టీడీపీ హయాం లో ఒక ఎకరా స్థలాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారు. సుమారు రూ.2 కోట్ల విలువ కలిగిన ఈ స్థలంలో నిర్మాణాన్ని ప్రారంభించారు. టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ నిర్మాణం ఆగిపోయింది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఇటీవల హడావిడిగా మిగిలిన పనులు పూర్తి చేశారు. దానికి వన్నెకుల క్షత్రియ కల్యాణ మండపం అని పేరుపెట్టి, ఈనెల 24వ తేది ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. దీనిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని వన్నెకుల క్షత్రియ నాయకుడు, కుప్పం మండల వైసీపీ కన్వీనర్ మురుగేశ్ ఆదివారం చెప్పారు. టీడీపీపై విమర్శలు చేశారు. కాగా, ఈ ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఎమ్మెల్యే చంద్రబాబు పేరు కానీ, స్థానిక ప్రొటోకాల్ కలిగిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేరు కానీ లేకపోవడం టీడీపీ శ్రేణుల దృష్టికి వచ్చింది. దీంతో టీడీపీ వన్నెకుల క్షత్రియ నాయకుడు, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం వన్నెకుల క్షత్రియ భవనం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. స్థలం కేటాయించి, భవన నిర్మాణం కూడా 90 శాతం పూర్తి చేసింది టీడీపీ హయాంలోనని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మాణం ఆగిపోయిన విషయం అందరికీ తెలుసన్నారు. దీనిపై ధర్నా కూడా చేశామని గుర్తు చేశారు. నాలుగేళ్లు మౌనంగా ఉన్న వైసీపీ నాయకులు ఎన్నికలు దగ్గర పడ్డాక స్వలాభంకోసం మిగిలిన 10 శాతం పనులను నాసిరకంగా పూర్తి చేసి ప్రారంభోత్సవ హడావుడి చేస్తున్నారని విమర్శించారు. శిలాఫలకంలో చంద్రబాబు, కంచర్ల శ్రీకాంత్ పేర్లు లేకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రొటోకాల్ ప్రకారం ఆ ఇద్దరి పేర్లు వేయాలని డిమాండు చేశారు. దీనిపై గుడుపల్లె తహసీల్దారు గుర్రప్పకు ఫిర్యాదు చేశారు.

# వీర్నమలలో కోలాహలంగా మైలారు పండుగ





మైలారు పండుగను తిలకించేందుకు వచ్చిన అశేష జనం - జనసమూహం మధ్య దూసుకెళ్తున్న ఎద్దులు

రామకుప్పం.జనవరి 22: రామకుప్పం మండలం వీర్నమలలో సోమవారం మైలారు పండుగ కోలాహలంగా జరిగింది. పండుగను తిలకించేందుకు వచ్చిన అశేషజనంతో వీర్నమల జనసంద్రంగా మారింది. మధ్యాహ్నం 12గంటలకు గ్రామదేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారికి, పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాత పంచాయతీ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన బరిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను డప్పులహోరు మధ్య పరుగులు తీయించారు. వేగంతో దూసుకెళ్తున్న ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించారు. ఎద్దులను నిలువరించిన యువకులు ఆనందోత్సాహాలతో కేరింతలతో నృత్యాలు చేశారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన మైలారు పండుగలో ఎటువంటి అవాంఛనీయ ఘటులు జరగక పోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. తక్కువ సమయంలో బరిలో పరుగులు తీసే ఎద్దులను కొనుగోలు చేసేందుకు తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వారు ఎద్దులను రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

# కమనీయం.. సీతారాముల కల్యాణం





స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు - మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

ఐరాల(కాణిపాకం), జనవరి 22: కాణిపాకంలో సోమవారం సీతారామ కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ప్రధాన ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, సిబ్బంది మాడ వీధుల ద్వారా పట్టువస్త్రాలు తీసుకువచ్చి అర్చకులకు అందించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు పోశారు. స్వామి కల్యాణాన్ని వీక్షించడానికి వేలాదిగా భక్తులు కాణిపాకం విచ్చేశారు. రాత్రి సీతారాముల ఉత్సవరనుఉ ఊరేగించారు. అలాగే, గార్గేయనదీ తీరాన వెలసిన కోదండరామాలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, భక్తులు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి దౌర్జన్యాలను రెండునెలల్లో అంతం చేస్తా

● పెద్దఉప్పరపల్లెలో రామచంద్రయాదవ్



సోమల, జనవరి 22: పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రౌడీయిజం, దౌర్జన్యాలను రెండు నెలల్లో అంతం చేస్తానని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఆదివారం పశువుల పండుగను పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి రామచంద్రయాదవ్ వస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ పోలీసులు కారణం చూపారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం రాత్రి ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడారు. సంక్రాంతి జరుపుకోకుండా గ్రామాల్లో కొన్ని దుష్టశక్తులు పోలీసులను అడ్డుపెట్టుకుని భయపెడుతున్నారని, ఎవరి బెదిరింపులకు భయపడరాదని తాను అండగా ఉంటానని తెలిపారు. నియోజవర్గంలో ఒక్క సర్పంచ్‌ను కూడా గెలిపించుకోవడం చేతకాక మంత్రి పెద్దిరెడ్డి దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు చేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీని జగన్ నెరవేర్చకుండా.. సమ్మెలోని వారిని ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు.

## వడివడిగా ఆర్థిక నిధులు

● పంచాయతీలకు మరో విడత విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: గ్రామపంచాయతీలకు ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడత నిధులు వారం కిందట విడుదలయ్యాయి. రెండో విడత కింద రూ.28.95 కోట్లు, వడ్డీ రూపేణ మరో రూ.26.83 లక్షలు సోమవారం విడుదల చేశారు. అన్‌టైడ్ పద్దు కింద రూ.11.52 కోట్లు, వడ్డీ కింద రూ.10.48 లక్షలు, టైడ్ పద్దు కింద రూ.17.43 కోట్లు, వడ్డీ కింద రూ.16.35 లక్షలు విడుదలయ్యాయి. అన్‌టైడ్ కింద మంజూరు చేసిన నిధులను జిల్లాలోని 684 గ్రామ పంచాయతీల ఖాతాలకు జమచేయగా, టైడ్ కింద సోమవారం విడుదలైన నిధులను నాలుగైదు రోజుల్లో పంచాయతీల ఖాతాలకు పీఎఫ్ఎంఎస్ ద్వారా జమకానున్నాయి. ఈ నిధులను క్లాప్‌మిత్ర జీతాలు, గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణం, ఎల్ఈడీ బల్బుల ఏర్పాట్లతో పాటు తాగునీటి వసతి కల్పించేందుకు వినియోగించనున్నారు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జనవరి22: క్రికెట్ ఆటల్లో చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు .. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె సమీపంలో ఆదివారం రాత్రి శివరాజు, రితేశ్ వర్గీయులు ఘర్షణ పడి గాయపడ్డారు. ఈ నేపథ్యంలో శివరాజు ఫిర్యాదు మేరకు సుబ్రహ్మణ్యం, లవకుమార్, రీతేశ్, దివాకర్, సురేశ్, మహేశ్, కృష్ణప్పలపై, రితేశ్ ఫిర్యాదు మేరకు శివరాజ్, శ్రీనివాసులు, శివకుమార్, వెంకటరమణ, ఆదినారాయణ, సతీశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## జిల్లా ఎన్నికల ప్రచారకర్తగా తులసిరెడ్డి



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: సార్వత్రిక ఎన్నికలు వస్తున్న తరుణంలో ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా స్వీప్ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల ప్రచార కార్యకర్తగా ఎం.తులసిరెడ్డి నియమితులయ్యారు. బంగారుపాళ్యం మండలానికి చెందిన ఈయన ఈనెల 25న చిత్తూరులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొంటారు. అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడైన తులసిరెడ్డి 1995-2002 వరకు అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాబృందంలో భారతదేశం తరఫున పాల్గొన్నారు. గతంలో ఏపీ సీనియర్ వాలీబాల్ (మెన్) టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన ఐవోబీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

## పలువురు ఏఆర్ ఎస్ఐల బదిలీ

చిత్తూరు, జనవరి 22: జిల్లాలో పలువురు ఏఆర్ ఎస్ఐలు బదిలీ అయ్యారు. వీరంతా తమకు కేటాయించిన చోట్ల రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారి వివరాలు.. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న కె.ప్రవీణ్‌కుమార్, ఎం. బాలాజీ నాయక్, ఎస్.మగ్బుల్, ఎం.రమేష్‌నాయక్, ముస్తఫాను చిత్తూరుకు బదిలీ చేశారు. చిత్తూరులో ఉన్న బి. రామ్మోహన్‌ను నంద్యాలకు, టీసీబాబును కడపకు, ఎంజీ నటరాజ్‌ను అన్నమయ్య జిల్లాకు, గోపాల్, ఫజులుద్దీన్‌లను అనంతపురంజిల్లాకు బదిలీ చేశారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు

## వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


పెద్దరెడ్డెమ్మ

పుంగనూరు రూరల్, జనవరి22: భార్య అదృశ్యమైనట్లు భర్త వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు ... మండలంలోని ఎంసీపల్లెకు చెందిన వెంకటరమణకు 11ఏళ్ల క్రితం చౌడేపల్లె మండలం మర్రిమాలకులపల్లెకు చెందిన పెద్దరెడ్డెమ్మతో వివాహం జరిగింది. తాను మేస్త్రీ పని చేసి జీవనం సాగిస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు. ఈనెల 17 మర్రిమాకులపల్లెలో జరిగే పశువుల పండగను ఇద్దరు కలసి వచ్చి భార్యను పుట్టింటిలో వదిలి తాను 18వ తేదీ స్వగ్రామానికి వచ్చినట్లు తెలిపారు. పెద్దరెడ్డెమ్మ 20తేదీ ఎంసీపల్లెకు వస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పినట్లు తెలిపారు. సాయంత్రం పనుల నుంచి ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించకపోగా అత్త గంగులమ్మ, బామర్ది హరి కృష్ణలకు తెలిపి అందరూ కలసి వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

కుప్పం, జనవరి 22: కుప్పం మండలం బంగారునత్తం చెరువులో ఆదివారం గల్లంతైన యువకుడు సంజయ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కుప్పం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి తల్లిదండ్రులు రవి, మంజుల కథనం మేరకు .... ఈనెల 20వ తేదీ శనివారంనాడు సంజయ్‌ను రవీందర్ అనే యువకుడు సామగుట్టపల్లెలోని ఇంటికి వచ్చి మరీ కారులో తీసుకెళ్లాడు. అదేరోజు సాయంత్రం ఆరు గంటలకు కొడుకుతో వీరు మాట్లాడారు. మళ్లీ అతడి జాడ తెలియలేదు. స్నేహితులైన రవీందర్, బాలాజీ, రోహిత్‌లు తమ కొడుకు సంజయ్‌ను హత్యచేసి ఉంటారన్న అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఆదివారం కుప్పం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బంగారునత్తం చెరువులో గల్లంతైన మృతదేహం సోమవారం మధ్యాహ్నానికి బయట పడింది. కుప్పం అగ్నిమాపకాధికారి ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో శనివారం సాయంత్రంనుంచి గాలించగా ఇప్పటికి దేహం దొరికింది. సంజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ మాట్లాడుతూ సంజయ్ శనివారంనాడు స్నేహితులతో కలిసి ఇంటినుంచి వెళ్లాడని, అతని స్నేహితులే ఏదో చేసివుంటారనని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని చెప్పారు.

## అంగన్వాడీల నిర్బంధం


నినాదాలు చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

పలమనేరు, జనవరి22 : ఛలో విజయవాడకు సోమవారం బయలు దేరిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను, యూనియన్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ సందర్భంగా వారు పోలీసుస్టేషన్ ముందే బైఠాయించి నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు ఓబుల్‌రాజు, భువనేశ్వరి, ఈశ్వరయ్య అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరిన అంగన్వాడీలపై కక్షసాధింపు ధోరణితో ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. అంతేకాక అంగన్వాడీలను శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్ని విధాలుగా భయభ్రాంతులకు గురిచేసినా తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పద్మా, కళావతి, సుగుణ, సుధాకర్, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## కుప్పంలో అంగన్వాడీలకు తొలగింపు ఉత్తర్వులు

కుప్పం, జనవరి 22: ఛలో విజయవాడ కార్యక్రమానికి హాజరైన కుప్పం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సీడీపీవో నుంచి సోమవారం తొలగింపు ఉత్తర్వులు అందాయి. న్యాయమైన కోర్కెలు పరిష్కరించమని శాంతియుతంగా ఆందోళన చేసే హక్కు తమకు లేదా అని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

## అంగన్వాడీలను అరెస్టు చేసిన పోలీసులు

వి.కోట, జనవరి 22: వి.కోట మండలం నుంచి ఛలో విజయవాడకు బయలుదేరిన పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దకు ఎస్‌ఐ మనోహర్ తమ సిబ్బందితో వెళ్ళి, అక్కడ సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగులకు ముందస్తుగా అరెస్టు చేస్తున్నట్టు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని తాము పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పోలీసులచే తమను అరెస్టు చేయించడం తగదని అంగన్వాడీ ఉద్యోగులు తెలిపారు.

## సీతారామాంజనేయస్వామి ఆలయంలో హోమం



పలమనేరు, జనవరి22 : అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహప్రతిష్ఠ సందర్భంగా పలమనేరు పాతపేట వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో యువకులు సీతారాముల చిత్రపటంతో కాషాయ జెండాలు కట్టుకొని ర్యాలీ నిర్వహించారు. పలమనేరు బజారువీధిలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు, వేదపండితులు హోమం నిర్వహించారు.

## వివాద స్థలం పంచాయతీకే...
### - అక్రమణలు తొలగించిన సర్పంచ్, ఎంపీటీసీలు

శాంతిపురం, జనవరి 22 : కొంతకాలంగా వివాదంలో ఉన్న స్థలాన్ని పంచాయతీకే అప్పగించినట్లు వైసీపీ మండల కన్వీనర్ దండపాణి తెలిపారు. సోమవారం కనమలదొడ్డి వద్ద దండపాణి, ఇతర వైసీపీ నేతలు, మొరసనపల్లె సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ ఆర్ముగం విలేకర్లతో మాట్లాడారు. అధికార పార్టీ మండల కన్వీనర్ దండపాణి అనుచరులకు కనమలదొడ్డి వద్ద సర్వే నెంబర్ 26-11లో 0.64 ఎకరాల డీకేటీ భూమి ఉంది. ఈ భూమిని సంతకు కేటాయించాలని గతంలో మొరసనపల్లె ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధికారులను కోరారు. ఇంతలో కొనుగోలు దారులు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. ఇది తెలుసుకున్న సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ ఆర్ముగం ప్రజల సహకారంతో నిర్మాణాలను అడ్డుకున్నారు. కానీ వారు నిర్మాణాలు చేపడుతూ వచ్చారు. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు పంచాయతీ వారు అడ్డుకున్నారు. దీనిపైన స్పందించిన ఆయన వెంటనే పనులను ఆపాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. ఇంతలో పెద్దమనుసులు కలిసి ఇరువురి మధ్య రాజీ ప్రయత్నాలు చేశారు. కొనుగోలు చేసిన వారు పంచాయతీ వారు అడిగినట్లు ఆ భూమిని పంచాయతీకే అప్పగిస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగిందని వారు తెలిపారు. అందరి సహకారంతో అక్రమణలను సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ ఆర్ముగం తొలగించారు.




# వాడవాడల్లో హోరెత్తిన శ్రీరామ నామం




పుంగనూరులో ర్యాలీ చేస్తున్న రామభక్తులు, చౌడేపల్లెలో ఊరేగుతున్న కమలాంజనేయస్వామి, సోమల పురవీధుల్లో రామభక్తుల శోభాయాత్ర

పుంగనూరు, జనవరి22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పుంగనూరులో శ్రీరామ నామస్మరణతో పురవీధులు హోరెత్తాయి. సోమవారం బజార్‌వీధిలో వెలసిన రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు రామలక్ష్మణులు, అంజనేయస్వామి వేషధారణలతో జైశ్రీరాం అంటూ రామస్వామి ఆలయం చేరుకున్నారు. తపాల కార్యాలయ సమీపంలో, ప్రకాశంకాలనీ, నగిరివీధి,చింతలవీధుల్లో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో అన్నదానం, చింతవీధి రామస్వామి కమిటీ, తాటిమాలకుపాళ్యం రామస్వామి ఆలయకమిటీ, ఎన్‌ఎస్‌పేట పంచముఖ అంజనేయస్వామి ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానాలు, గోకుల్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు అన్నదా నం చేశారు. పట్టణ పరిధిలోని 9 రామస్వామి ఆల యాల్లో దీపారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఆర్యవైశ్యసభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు.

**చౌడేపల్లె** : అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటా శ్రీరామ నామస్మరణతో పులకించింది. కమలాంజనేయ ఆలయంలో స్వామిని, గోసలకురప్పల్లెలో సీతారామ, లక్ష్మణ అంజనేయ స్వాములను ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**సోమల** : మండలంలోని పలు రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమల యోగాభి రామాలయంలో అర్చకులు రామరత్నం శాస్త్రి అభిషేక పూజలు చేశారు. భక్తులచే రామకోటి జపయజ్ఞం నిర్వహించారు. రాజస్థాన్ దుకాణదారులు లడ్డూలను భక్తులకు పంచారు. రాత్రి సీతారాముల ఉత్సవమూర్తులను పల్లకీలో అలంకరించి ఊరేగించారు.

**వి.కోట** : వి.కోటలో శోభాయాత్ర వైభవంగా జరిగింది. పత్రపల్లెలో ఉదయం సీతారాముల కల్యాణోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. అనంతరం ఉత్సవర్లను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. భక్తులు దేవతామూర్తులకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. కన్యకాపరమేశ్వరీ ఆలయ భక్తబృందం వారు చిన్నారులతో కలిసి చేసిన కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వి.కోట దుర్గామాత ఆలయం వద్ద అన్నసంతర్పణ చేశారు.

**పెద్దపంజాణి** : మండలంలోని కొత్తవీరప్పల్లె కోదండ రామాలయంలో స్వామికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ టీవీ ఏర్పాటు చేసి అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ లైవ్ చూపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి సోదరుడు శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

**రామకుప్పం** : రామకుప్పంలో శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద విశేష పుష్పాలంకృత పంచాశ్వరథంలో సీతా, లక్ష్మణ, కోదండరామస్వామి ఉత్సవర్లను అధిష్ఠింపజేశారు. అక్కడి నుంచి భజన బృందాల పాటల ఆలాపనలతో ఊరేగింపు జరిగింది. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

**శాంతిపురం** : రాళ్ళబూదుగూరు కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సర్పంచ్ లక్ష్మి, ఆర్ఎస్ మణి, బసవరాజు, ఎంఆర్ నారాయణ, ఎంపీటీసీ రమేష్, ఉదయకుమార్ తదితరులు సీతారాముల చిత్రపటంలో ఊరేగింపు చేపట్టారు. బస్టాండ్ సర్కిల్‌లో శ్రీరాముని చిత్రపటం ఏర్పాటు చేసి భక్తులకు పానకం, పెసర పప్పు పంపిణీ చేశారు.

**రొంపిచెర్ల**: రొంపిచెర్ల సమీపంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో, రాములవారివీధిలోని పట్టాభి రామాలయంలో, సవ్వా వాండ్లపల్లె, పెద్దగొట్టిగళ్లు, మోటు మల్లెలలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రొంపిచెర్లలో సీతారామ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

**బైరెడ్డిపల్లె** : బైరెడ్డిపల్లెలో వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ప్రత్యేక రథంలో రామచంద్ర స్వామి ఉత్సవమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. రామ భక్తమండలి సభ్యులు, భజరంగదళ్ సభ్యులు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. అలాగే స్థానిక కోదండరామస్వామి ఆలయం, దాసార్లపల్లె కార్వేటి కొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. రామసముద్రంలో నూతన సీతారామచంద్రస్వామి ఆలయ కుంభాభిషేకం కూడా ఘనంగా జరిగింది. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, స్వామివారిని దర్శించుకున్నారు.


రామకుప్పం బజారువీధిలో సాగిన శోభాయాత్ర





వి.కోటలో సాగిన శోభాయాత్ర, రాళ్ళబూదుగూరులో కోదండరామస్వామి చిత్రపటం ఊరేగింపు, బైరెడ్డిపల్లెలో రామచంద్రస్వామి ఉత్సవం, పెద్దపంజాణిలో ప్రత్యేక పూజలందుకున్న రామాంజనేయులు

# పారదర్శకంగా ఓటర్ల జాబితా : ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో మనోజ్‌కుమార్

పలమనేరు, జనవరి22 : పలమనేరు నియోజకవర్గ ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేశారని పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఓటర్ల తుది జాబితా పబ్లికేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విలేకరుల సమావేశంలో ఆర్డీవో ప్రసంగించారు. ఓటర్ల జాబితా తయారీ అన్నది నిరంతర ప్రక్రియ అని, ఇప్పటికీ ఏవైనా పొరపాట్లు గుర్తించితే చేర్పులు, తీసివేతలు, మార్పులకు అవకాశం వుందన్నారు. అర్హత వుండి ఎవరి పేరైనా ఓటర్ల జాబితాలో లేకుంటే భయపడాల్సిన పనిలేదన్నారు. 2019లో పలమనేరు నియోజకవర్గంలో 247613 మంది ఓటర్లు వుండగా నేడు ఈ సంఖ్య 266935కు చేరిందన్నారు. అంటే 19322 మంది ఓటర్లు పెరిగారని పేర్కొన్నారు. అంతేకాక ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 5, సర్వీసు ఓటర్లు 236 మంది ఉన్నారని, వీరిని కూడా కలుపు కొంటే నియోజకవర్గ ఓటర్ల మొత్తం సంఖ్య 267178 అన్నారు. సమావేశంలో పలమనేరు తహసీల్దార్ కుప్పస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, బీజేపీ పట్టణ కన్వీనర్ తాతయ్యనాయుడు, టీడీపీ నాయకులు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, అడ్వకేట్ జగదీష్‌నాయుడు, సీపీఐ నుంచి సుబ్రమణ్యం, సీపీఎం నుంచి ఓబుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# పుంగనూరులో 2.37 లక్షల మంది ఓటర్లు


పుంగనూరులో ఓటర్ తుది జాబితా విడుదల చేస్తున్న జడ్పీ సీఈవో

పుంగనూరు, జనవరి22: పుంగనూరు నియోజకవర్గంలో 2,37,803మంది ఓటర్లు ఉన్నట్లు తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తుది ఓటర్ల జాబితా విడుదల చేసి వివరాలను మీడియాకు వివరించారు. 2019 ఎన్నికల్లో 2,18,268మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,08,479మంది మహిళలు1,09,768మంది, ట్రాన్స్‌జెండ్స్ 21మంది ఉండేవారన్నారు. 2024 జనవరి 22వతేదీ నియోజకవర్గంలో పురుషులు 1,16,623 మంది, మహిళలు 1,21,172మంది, ట్రాన్స్‌జెండ్స్ 8మంది కలిపి 2,37,803మంది ఉన్నట్లు ప్రకటించారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు తుది జాబితా ప్రకటించినా షెడ్యూల్ విడుదలై నామినేషన్ల రోజు వరకు ఓటర్ల చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. గత ఏడాది అక్టోబరు 27తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 12తేదీ వరకు 13,926మంది తొలంగించడం జరిగిందని, నూతనంగా 19538మంది ఓటర్లుగా చేరారన్నారు. ఇతర నియోజకవర్గాలనుంచి పుంగనూరు మండలంలో 5,885మంది ఓటర్లుగా చేరినట్లు తెలిపారు. కాగా 19ఏళ్లలోపు వయసు గలవారు 5041మంది, 20-29ఏళ్లలోపు వారు 40,745మంది, 30-39ఏళ్ల మధ్య వారు 60,323మంది, 40-49ఏళ్ల లోపు గల వారు 56972మంది, 50-59 ఏళ్ల మధ్యలోపు వారు 36,901మంది, 60-69ఏళ్ల మధ్య లోపు వారు 23,284మంది, 70-79ఏళ్ల మధ్యలోపు వారు 11,256మంది, 80-89 ఏళ్ల మధ్య లోపు వారు 2929 మంది, 90-99ఏళ్ల లోపువారు 344మంది, 100-109ఏళ్ల మధ్య లోపు వారు 8మంది ఉన్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషన్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్లు సీతారామ్, శేషగిరిరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం నియోజకవర్గ ఓటర్లు 2,23,104 మంది



కుప్పం, జనవరి 22: కుప్పం నియోజకవర్గంలో తుది ఓటర్ల జాబితాను ఆర్డీవో శ్రీనివాస్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాలలో కలిపి ఓటర్ల సంఖ్య 2,23,104 గా ఉన్నట్లు చెప్పారు. అనర్హులైన 8778 మంది ఓటర్లను జాబితానుంచి తొలగించి, కొత్తగా 14,111 మంది ఓటర్లను జాబితాలో చేర్చామన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం శాంతిపురం మండలంలో 46,268 మంది ఓటర్లు, రామకుప్పం మండలంలో 45,610, గుడుపల్లె మండలంలో 34,253, కుప్పం మండలంలో 4,667, కుప్పం అర్బన్‌లో 36,973 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కుప్పం తహసీల్దారు పార్వతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండరు ఆవిష్కరణ

రామకుప్పం, జనవరి 22: పీఆర్టీయూ 2024 క్యాలెండరును రామకుప్పంలో సోమవారం ఎంఈవో నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు శంకర్, నందకుమార్, విజయ్ కుమార్, సుజాత, మునిరాజరెడ్డి, శ్రీదేవీ, హరిప్రసాద్, సుధాకర్, అన్బళగన్, సురేష్‌నాయక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

శాంతిపురం, జనవరి 22 : శాంతిపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా గిరిబాబు, అధ్యక్షుడిగా ఎం. సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.అజిత్‌కుమార్, మహిళా అధ్యక్షురాలిగా బి.భారతి, సెక్రెటరీగా వీరభద్ర, జిల్లా కౌన్సిలర్‌గా భూపాల్, ఉపాధ్యక్షుడిగా రఘురాం, మహిళా కార్యదర్శిగా శివకుమారి, జాయింట్ సెక్రెటరీగా మునిరత్నం, మండల కన్వీనర్‌గా ఆర్.ప్రహక్లిత్, కార్యవర్గ సభ్యులుగా మహేష్, విజయకుమార్, లక్ష్మయ్య, విజయకుమార్‌రెడ్డి, రమేష్, రెడ్డప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ శంకర్ రాధాకృష్ణ, వెంకటేష్, మంజుల, మునిరాజారెడ్డి, నందకుమార్, విజయకుమార్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ద్రావిడ వర్సిటీలో పరీక్షల తనిఖీ

గుడుపల్లె, జనవరి 22: ద్రావిడ విశ్వవిద్యాలయంలో సోమవారం నుంచి జరుగుతున్న డిగ్రీ, పీజీ పరీక్షలను ఉపకులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి తనిఖీ చేశారు. భాషా భవనం, పెరియార్ భవనం, తిరువళ్లువర్ భవనాల్లోని పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జామ్స్ డీన్ ఆచార్య అరవింద్‌కుమార్, ఎగ్జామ్స్ చీఫ్ ఆచార్య శారద తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ వితరణ

బైరెడ్డిపల్లె, జనవరి 22 : రామసముద్రం గ్రామానికి సోమవారం సర్పంచ్ రాజారెడ్డి చొరవతో మునిపల్లెకు చెందిన దాతలు హనుమంతరెడ్డి కుటుంబీకులు అంబులెన్స్ వాహనాన్ని వితరణ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామస్తుల సౌకర్యం కోసం అంబులెన్స్‌ను అందజేసిన దాతలను అభినందించారు.

## 'రోడ్డు విస్తరణ పనుల్లో వివక్ష'

పుంగనూరు, జనవరి22: పుంగనూరు రోడ్డు విస్తరణ పనుల్లో అధికారపార్టీ నాయకులు, ధనవంతులకు ఒక రకంగా, పేదలకు మరొక విధంగా పాటిస్తున్నారని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ 70 అడుగులు వుండాల్సివుండగా వైసీపీ నాయకులు, ధనవంతులు, వైసీపీ ప్రజాప్రతినిధుల స్థలాల్లో అధికారులు వివక్ష ప్రదర్శిస్తూ పేదలు స్థలాలు మాత్రం అన్యాయంగా మార్కింగ్ ఇచ్చి కూల్చివేస్తున్నారన్నారు. సమన్యాయం పాటించి సక్రమంగా రోడ్డు విస్తరణ పనులు చేట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## జడ్పీ అతిథి గృహం పనుల పరిశీలన

పుంగనూరు రూరల్, జనవరి22: స్థానిక ట్రావెన్స్ బంగ్లా ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న జడ్పీ అతిథి భవన పనులను సోమవారం జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. సీసీ రోడ్ల పెండింగ్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట డీఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, పీఆర్‌ఏఈ సుబ్రహ్మణ్యంరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరసేవకు వెళ్లిన రామిరెడ్డికి సన్మానం



పలమనేరు, జనవరి22 : అయోధ్యలో బాలరాముడి విగ్రహావిష్కరణ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం నాడు కరసేవకు వెళ్లిన అప్పటి విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.రామిరెడ్డిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. నాడు అయోధ్యలో అద్వాని రథయాత్ర సందర్భంగా ఇచ్చిన పిలుపు మేరకు పలమనేరు నుంచి రామిరెడ్డి, ముద్దప్ప వెళ్లారు. ముద్దప్ప నాలుగేళ్లక్రితం మృతి చెందారు. దీంతో ఇక్కడి బీజేపీ నాయకులు శరవణ కుమార్, బాబు, వరద రాజులు, తదితరులు రామిరెడ్డి ఇంటికి వెళ్లి శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు.

## ఆర్డీవో స్పందనకు 11 అర్జీలు

పలమనేరు, జనవరి22 : పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో మనోజ్‌కుమార్ ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిదిలోని 11 మంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ప్రజలనుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని అర్జీదారులకు ఆర్డీవో హామీ ఇచ్చారు.

## రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



కుప్పం, జనవరి 22: కుప్పం-గుడుపల్లె స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వృద్ధురాలికి సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. రైలు డీకొని మరణించి ఉంటుందని, గుర్తుపట్టిన వారు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## జనసేన రాయలసీమ జోన్ కమిటీ సభ్యుడిగా చైతన్యరాయల్

పుంగనూరు రూరల్, జనవరి22: పుంగనూరుకు చెందిన చైతన్య రాయల్‌ను రాయలసీమ జోన్ కమిటీ సభ్యుడిగా జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెళ్ల మనోహర్ ఎంపిక చేశారు. సోమవారం చైతన్యరాయల్ మాట్లాడుతూ పార్టీ ప్రతిష్ఠతకు కృషి చేస్తామన్నారు.

## నేడు రామకుప్పంలో జయహో బీసీ గర్జన

రామకుప్పం, జనవరి 22: టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం రామకుప్పంలో జయహో బీజీ గర్జన సభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ర్యాలీ అనంతరం పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు టీడీపీ శ్రేణులతోపాటు, మండలంలోని బీసీలంతా హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

## లక్ష కుంకుమార్చన పోస్టర్ ఆవిష్కరణ

చౌడేపల్లె,జనవరి22: బోయకొండ గంగమ్మ ఆలయంలో జరగనున్న లక్ష కుంకుమార్చన పోస్టర్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం తిరుపతిలో ఆవిష్కరించారు ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి మాట్లాడుతూ..ఫిబ్రవరి 28నుంచి మార్చి1 వరకు బోయకొండలో లక్ష కుంకుమార్చన జరుగుతుందన్నారు. అలాగే రెండవ విడతలో బోయకొండలో రూ..36 కోట్లతో జరగాల్సిన అభివృద్ధి పనుల అంచనాలను మంత్రికి అందించినట్లు తెలిపారు.

## టీడీపీ నేతలకు జన సైనికుల ఘన స్వాగతం


మురళీమోహన్‌ను సన్మానిస్తున్న అరుణ్

పూతలపట్టు, జనవరి 22: పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్‌తో పాటు పలువురు ఆ పార్టీ నేతలకు ఎం.బండపల్లి గ్రామానికి చెందిన జన సైనికులు ఘనంగా స్వాగతం పలికారు. అయోధ్యలో బాల శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎం.బండపల్లిలో ఉన్న రాములవారి గుడి వద్ద చేపట్టిన పూజా కార్యక్రమాలకు టీడీపీ నేతలను జనసేన నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అక్కడికి వెళ్లిన టీడీపీ నాయకులకు జనసేన నాయకులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేత అరుణ్ తోపు, మనోహర్, మండల టీటీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగారప్ప గోపీ, వసంతకుమార్, చంద్రమౌళి, రామానుజం, జయరాం, పళణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు: టీడీపీ

శ్రీరంగరాజపురం, జనవరి 22: రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓట్ల ద్వారా ప్రజలే బుద్ధి చెబుతారని నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ అన్నారు. సోమవారం ముద్దికుప్పం పంచాయతీ పరిధిలోని చొక్కమడుగు గ్రామంలో ఇంటింటికీ థామస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ థామస్ తమ్ముడు నిధి మాట్లాడుతూ చంద్రబాబుకు ఈసారి ఎన్నికల్లో ప్రజలు పట్టం కడితేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. జల్లా వెంకటేష్‌రెడ్డి, మారయ్య, రఘునాథరెడ్డి, చెల్లయ్య, గణపతి, సుబ్రమణ్యం, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, జనవరి 22: మండలంలోని శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పూర్వ విద్యార్థి వరదరాజు చెంచురాజు సోమవారం విద్యాసామగ్రిని పంపిణీ చేసినట్టు ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు తెలిపారు. విద్యార్థులకు కావలసిన పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, నోటుపుస్తకాలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యాకమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయుడు రవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## గోపురం నిర్మాణానికి పూజ

తవణంపల్లె, జనవరి 22: మండల కేంద్రం తవణంపల్లెలో గల ఓం శక్తి దేవస్థానం గర్భగుడి గోపురం నిర్మాణానికి పూతలపట్టు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ గ్రామస్తులతో కలిసి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, నాయకులు మణి టైలర్, పట్నం గోపి తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీని ఆదరించండి

బంగారుపాళ్యం, జనవరి 22: వచ్చే ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి కాణిపాకం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని ముంగరమడుగు దళితవాడలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నోట్ల రాజ్యాన్ని ఓడిద్దాం, ఓట్ల రాజ్యాన్ని సాధిద్దాం అని యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కుమారస్వామి, పూతలపట్టు నియోజకవర్గ ఉపాధ్యక్షులు చంద్రకళ బాబు, మండలాధ్యక్షుడు హేమాద్రి పాల్గొన్నారు.



## మహిళ అదృశ్యం

చిత్తూరు, జనవరి 22: మామ ఇంట్లో ఉంటున్న ఓ మహిళ ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెదురుకుప్పంకు చెందిన రమ్య(28) తన మామ నివాసమున్న చిత్తూరులోని ఎస్టేట్‌లో ఉండేది. ఈ నేపథ్యంలో రమ్య ఈ నెల 20వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ ఉలసయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్వచ్ఛందంగా చికెన్ దుకాణాల మూత


మూతపడిన చికెన్‌సెంటర్

పూతలపట్టు, జనవరి 22: అయోధ్యలో బాల శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని చికెన్ వ్యాపారస్తులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. కుల మతాలకు అతీతంగా దుకాణదారులు మూసివేయడంలో పలువురు వారిని అభినందించారు.

## నూతన ఎక్సైజ్ సీఐగా లక్ష్మీ దుర్గయ్య



కార్వేటినగరం, జనవరి 22: కార్వేటినగరం నూతన ఎక్సైజ్ సీఐగా లక్ష్మీ దుర్గయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయన వేరే జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం అక్రమ రవాణాను అరికడతామని తెలిపారు.

## 127 మంది అంగన్వాడీల తొలగింపు

వెదురుకుప్పం, జనవరి 22: కార్వేటినగరం ఐసీడీఎస్ పరిధిలో నిరవధిక సమ్మెలో ఉన్న 127 మంది అంగన్వాడీలను తొలగిస్తూ పీడీ నాగశైలజ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీడీపీవో పద్మనునంద తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో 127 మంది తొలగింపు చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, ఎస్ఆర్‌పురంలో ఎవరిపైనా చర్యలకు సిఫార్సు చేయలేదన్నారు. అక్కడి వారంతా నిర్ణీత సమయంలో విధుల్లో చేరినట్లు ఆమె చెప్పారు.

## ప్రభుత్వ వైఖరిపై అంగన్వాడీల కన్నెర్ర

కార్వేటినగరం, జనవరి 22: తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ వైఖరిపై అంగన్వాడీలు మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మెను సోమవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించలేని రాష్ట్ర ప్రభుత్వం సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలను విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపు ప్రకటనలు చేయడం, షోకాజు నోటీసులు జారీ చేయడం తగదని హెచ్చరించారు. కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

## పాళ్యం కొండకు పూజలు

గుడిపాల, జనవరి 22: మండలంలోని ఏఎల్‌పురం సమీపంలో వెలసియున్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లేందుకు దాతల సహకారంతో ఏర్పాటుచేసిన మెట్లకు సోమవారం నిర్వాహకులు పూజలు నిర్వహించారు. ఈ గుడికి రహదారి సరిగ్గా లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామస్తులు కలిసి మెట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామపెద్దలు, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం

పూతలపట్టు, జనవరి 22: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద టీడీపీ నేత ఓట్ల నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సుమారు 300మందికి పైగా అన్నదానం చేశారు. టీడీపీ నేతలు హేమాద్రి నాయుడు, రామానుజం, హరి, ఏకాంబరం, సుబ్బరాజులు, నాగరాజు, వీరభద్రయ్య, బాలాజీ, భాస్కర్, ఏకాంబరం పాల్గొన్నారు.

## అధిక శక్తి కలిగిన మందులు పిచికారి చేయొద్దు


మాట్లాడుతున్న జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ రెడ్డిరామ్

ఐరాల, జనవరి 22: మామిడి పంటపై అధిక శక్తి కలిగిన మందులను పిచికారి చేయడం వలన పురుగులు ప్రతిఘటన శక్తిని పెంచుకుంటాయని జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ రెడ్డిరామ్, శాస్త్రవేత్త నాగమణి అన్నారు. సోమవారం 35యర్లపల్లెలో తిరుపతి వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవంపై రైతు సదస్సు నిర్వహించారు. రైతులకు వరి, వేరుశనగ, చెరకు, రాగి, చిరుధాన్యాలపై అవగాన కల్పించారు. రైతులకు వ్యవసాయ శాఖ అందుబాటులో ఉన్న విత్తనాల గురించి వివరించారు. సర్పంచ్ మల్లీశ్వరి, ప్రిన్సిపల్ రెప్రజెంటేటివ్ వెంకటరెడ్డి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ వస్తేనే గ్రామాల అభివృద్ధి

నింద్ర, జనవరి 22: మండలంలోని శ్రీరామపురం ఆది ఆంధ్ర వాడలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రంలో టీడీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ప్రకాష్, జీవ, శివప్రసాద్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



## దళిత హక్కుల చట్టాలను పక్కాగా అమలు చేయాలి

చిత్తూరు కల్చరల్, జనవరి 22: దళిత హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ఏర్పాటు చేసిన హక్కులను ప్రభుత్వ అధికారులు పక్కాగా అమలు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలోని గంగినేని చెరువు పార్కులో దళిత ప్రజా సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాలను సమీక్షించారు. టి. గోవిందన్,మునస్వామి, ధనంజయరావు పాల్గొన్నారు.




చిత్తూరు కోదండ రామాలయంలో స్వామి అమ్మవార్లకు హారతి, గాంధీ కూడలిలో శ్రీరామజ్యోతి ప్రజ్వలన, పెనుమూరులో స్వామి వారి ఊరేగింపు

# శ్రీరామ... జయ రామ... జయ జయ రామ

● వాడవాడలా హోరెత్తిన జైశ్రీరాం నినాదం

చిత్తూరు కల్చరల్, జనవరి 22: అయోధ్యలో బాల శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నగరంలో ఎక్కడ చూసినా జైశ్రీరాం అంటూ రామనామ నినాదం హోరెత్తిపోయింది. ఒక వైపు ప్రధాన కూడళ్లలో శ్రీరాముడి చిత్ర ఫ్లెక్సీలకు పూజలు, క్షీరాభిషేకాలు, రామ మందిరాల్లో భజనలు, మతాలకు అతీతంగా ర్యాలీలు, నగర సంకీర్తనలు చేయగా, మరోవైపు అన్నదాన కార్యక్రమాలతో చిత్తూరు నగరం సందడిగా మారింది. స్థానిక కోదండ రామాలయంలో ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. గొడుగుమూరులో శ్రీరామ భజన మందిరాన్ని ఆధునికీకరించి కుంభాభిషేకం నిర్వహించారు. గిరింపేట రాఘవేంద్రస్వామికి, పగడమాను వీధి, బజారు వీధి శ్రీరామ భజన మందిరాల్లో పూజలు, భజనలు చేశారు. పలు ఆలయాల నిర్వాహకులు, వర్తక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. స్థానిక గాంధీ కూడలిలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు బాబు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటం వద్ద దీపాలంకరణ నిర్వహించారు. బీజేపీ ఓబీసీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, పూజారి వెంకటేష్, చిట్టిబాబు, వేలు తదితరులు పాల్గొన్నారు. బజారు వీధి కె.వి.ఆర్.సి జ్యువెలరీస్ ఆధ్వర్యంలో మహిళలకు నూతన వస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు పంపిణీ చేశారు. చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో చర్చివీధిలో, గిరింపేట దుర్గాంబ ఆలయంలో అమ్మవారి భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

**గుడిపాల:** రామభద్రాపురం, ఏఎల్‌పురం, 197 రామాపురం, నంగమంగళం, చెరువు ముందరవూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ముట్టుకూరుపల్లి గ్రామంలోని శ్రీరామభక్తుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** ముత్యాలమ్మ ఆలయం, సీతారాముల ఆలయాల వద్ద సీతారాముల చిత్రపటాలను ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ కామరాజు, మురారి, ప్రసాద్, మధు, మోహన్‌లాల్, లాల్‌రామ్, చందు తదితరులు పాల్గొన్నారు.

**కార్వేటినగరం:** కార్వేటినగరం బొందు వీధిలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**నింద్ర:** నింద్రలోని ప్రసన్న వినాయక స్వామి ఆలయంలో రామకోటి భజనతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**పెనుమూరు:** పెనుమూరులోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. వాసుదేవ నాయుడు, గురుమూర్తి సుబ్రమణ్యం, యుగబాబు, మోహన్‌శెట్టి, భక్తులు పాల్గొన్నారు.

**పాలసముద్రం:** క్రిష్ణజిమ్మాపురంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, రాచపాళ్యంలోని బాల గురునాధీశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఇండ్ల వద్ద దీపాలు వెలిగించారు.

**వెదురుకుప్పం:** ఆళ్లమడుగు పంచాయతీ బుచ్చిరెడ్డికండ్రిగలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నప్రసాదం వితరణ చేశారు. బీజేపీ మండలాధ్యక్షులు విశ్వనాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**నగరి:** నగరి పట్టణ పరిధిలోని పెరుమాళ్ గుడి వీధిలో వాణిగాయత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటాన్ని ఊరేగించారు. ఓ.బాలసుబ్రమణ్యం, నాగేంద్రప్రసాద్, శివకుమార్, సురేష్, పలువురు బ్రాహ్మణులు పాల్గొన్నారు


బుచ్చిరెడ్డికండ్రిగలో బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ


నగరిలో శ్రీరాముడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

# చిత్తూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం

● మొత్తం ఓటర్లు 2,00,822 లక్షలు ● మహిళా ఓటర్లు 1,03,023
● పురుష ఓటర్లు 97,765, ఇతరులు 34


తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఈఆర్వో, ఏఈఆర్వో, చిత్తూరు, గుడిపాల తహసీల్దార్లు

చిత్తూరు రూరల్, జనవరి 22: చిత్తూరు నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో ఈఆర్వో, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య సోమవారం విడుదల చేశారు. మొత్తం 2,00,822 ఓటర్లు ఉండగా, అందులో మహిళలు 1,03,023, పురుష ఓటర్లు 97,765 ఉండగా, ఇతరులు 34 మంది ఉన్నారు. ఎప్పటిలానే ఈసారి కూడా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా నమోదు చేసినట్లు చెప్పారు. ఈ తుది జాబితాను చిత్తూరు ఆర్డీవో కార్యాలయం, చిత్తూరు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కు వివరాలను ఈ జాబితాలో సరిచూసుకోవాలని, ఏదైనా పొరపాట్లు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఓటరు సవరణ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. అనంతరం ఏఈఆర్వో అరుణ, చిత్తూరు తహసీల్దార్ మురళీమోహన్‌లు మాట్లాడుతూ మొత్తం 13,047 మంది ఓటర్లను తొలగించినట్లు చెప్పారు. ఇందులో మరణించిన వారు 5,839, పర్మనెంట్ షిఫ్టెడ్ 5,721 మంది, రిపీటెడ్ 1,484 మంది, డిస్‌క్వాలిఫైడ్ ఇద్దరు ఉన్నారని తెలిపారు. వీటిని ఒకటికి రెండు సార్లు విచారణ చేసి తొలగించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుడిపాల తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, చిత్తూరు రూరల్ మండలం తహసీల్దార్ అరుణకుమారి, ఏఎస్‌వో సౌందర్‌రాజన్, డీటీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 2,04,635 ఓటర్లు

● మహిళా ఓటర్లు 1,02,918 మంది, పురుష ఓటర్లు 1,01,710 మంది ● నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి భవాని వెల్లడి

గంగాధరనెల్లూరు, జనవరి 22: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో మొత్తం 2,04,635మంది ఓటర్లు ఉన్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి భవాని వెల్లడించారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఓటర్ల వివరాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గంగాధరనెల్లూరు మండలంలో మహిళా ఓటర్లు 27,003 మంది, పురుష ఓటర్లు 26,870 మంది, ఇతరులు ఇద్దరు ఓటర్లు, వెదురుకుప్పం మండలంలో మహిళా ఓటర్లు 17,977 మంది, పురుష ఓటర్లు 18,140 మంది, కార్వేటినగరం మండలంలో మహిళా ఓటర్లు 17,830 మంది, పురుష ఓటర్లు 17,253 మంది, పెనుమూరు మండలంలో మహిళా ఓటర్లు 16,237 మంది, పురుష ఓటర్లు 16,156 మంది, శ్రీరంగరాజుపురం మండలంలో మహిళా ఓటర్లు 14,755 మంది, పురుష ఓటర్లు 14,484 మంది, పాలసముద్రం మండలంలో మహిళా ఓటర్లు 9,026 మంది, పు రుష ఓటర్లు 8,807 మంది ఉన్నారని చె ప్పారు. నియోజకవర్గంలో ఓటర్ల జాబి తా పరంగా ఎక్కడా ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోలేదని, సాంకేతిక కారణాల వల్ల ఏదైనా పొరబాట్లు జరిగిఉంటుందే తప్ప ఇతరత్రా సమస్యలు ఏమిలేవని తెలిపారు. 2019 ఎన్నికల నాటికి 1,93,588 మంది ఓటర్లు ఉండేవారని, కొత్తగా 11,048 మంది చేరాక మొత్తం 2,04,635 మంది ఓటర్లు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. తహసీల్దార్ ఇన్బనాధన్, ఎన్నికల డీటీ విజయకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి భవాని

### ఓటర్ల జాబితాను పరిశీలించుకోండి: ఆర్డీవో


నగరి, జనవరి 22: నగరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయని, బూత్‌ల వారీగా బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉన్నాయని ఆర్డీవో సృజన పేర్కొన్నారు. నగరిలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలను ఓటర్లు పరిశీలించుకోవాలని సూచించారు. 2024 జనవరి 21వ తేదీ వరకు నగరి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 2,01,447 ఓట్లు ఉండగా, అందులో 1,03,358 మంది మహిళా ఓటర్లు, 98,081 మంది పురుష ఓటర్లున్నారు. 18 సంవత్సరాలు పూర్తయి, ఓటు లేని వారు జాబితాను పరిశీలించి తమ దృష్టికి తీసుకురావాలని, ఏమైనా పొరబాట్లు ఉన్నా తెలియజేయాలన్నారు.

## కాంగ్రెస్ నాయకుల నిరసన


నగరిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

నగరి, జనవరి 22: అసోంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్రపై బీజేపీ దాడులు చేయడం పట్ల సోమవారం నగరి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్‌పార్టీ నాయకులు నిరసన తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు మాట్లాడుతూ భారత్ జోడో న్యాయయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండటంతో బీజేపీ నాయకులు ఓర్వలేక రాహుల్‌గాంధీని అడుగడుగునా అడ్డుకుంటున్నారని విమర్శించారు. జరగబోయే జనరల్ ఎన్నికలలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, డీసీసీ కార్యదర్శులు ఢిల్లీ, దేశయ్య, చిరంజీవిరెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, సుబ్రమణ్యంరెడ్డి, ఏలుమలై, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు, జనవరి 22: మొదలియార్ కుల పెద్దలు చిన్న మరుదు, పెద్ద మరుదు విగ్రహాల ఏర్పాటుకు సోమవారం గంగినేని చెరువు వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమి చేశారు. నెల రోజుల కిందట విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్థలాన్ని కమిషనర్ అరుణ గుర్తించారు. స్థలానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్‌కు అందించారు. సోమవారం గంగినేని చెరువు వద్ద చిన్న మరుదు, పెద్ద మరుదు విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. త్వరలో విగ్రహాలను ఆవిష్కరిస్తామని బుల్లెట్ సురేష్ తెలిపారు. మేయర్ అముద, బుల్లెట్ అప్పు పాల్గొన్నారు.

## 25న తైమాస పూజలు

చిత్తూరు కల్చరల్, జనవరి 22: గిరింపేట వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో ఈ నెల 25న తైమాస పూజలు నిర్వహిస్తున్నట్లు కాళభైరవ ట్రస్టు నిర్వాహకులు టి. వెంకటేశన్ తెలిపారు. సోమవారం అగస్త్యేశ్వరాలయంలో ఉత్సవ కరపత్రాలను అర్చకులు శివకుమార్, చాణిక్య రవి, పాలకమండలి చైర్మన్ శివప్రసాద్‌లు ఆవిష్కరించారు.

## వైసీపీ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్, జనవరి 22: చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేటలో వైసీపీ కార్యాలయాన్ని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని అనంతాపురం, జంగాలపల్లి, శెట్టింతంగల్ గ్రామాల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులుతో కలిసి బీఎన్ఆర్ పేటలోని రామాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చిత్తూరు జడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు, సర్పంచ్ అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



ఐరాల, జనవరి 22: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, విద్యాశాఖాధికారులు రేషీంద్రబాబు, దామోదర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు అరుణ్‌కుమార్, చంద్రశేఖర్ నాయుడు, కోమల, పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడు హేమచంద్రారెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మధు, నాయకులు రాజేష్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ సంప్రోక్షణ

తవణంపల్లె, జనవరి 22: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 36 అడుగుల అభయ ఆంజనేయస్వామి విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాన్ని వేదపండితులు ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, పరిసర గ్రామప్రజలు పాల్గొన్నారు.

## 182వ రోజు అన్నదానం

గుడిపాల, జనవరి 22: మండలంలోని అన్నా క్యాంటీన్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో 182వ రోజు అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన వీవీ ఇంటర్నేషనల్ స్కూల్ యజమాని బాలాజి భోజనం వితరణ చేశారు. మాజీ సర్పంచ్ రవి నాయుడు, కార్యదర్శి కిట్టు, టీడీపీ నాయకులు మధుసూదన్ నాయుడు, ఐజాక్, రాజా, జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

శ్రీరంగరాజపురం, జనవరి 22: కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్ అన్నారు. సోమవారం ముద్దికుప్పం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.